

# అంగన్వాడి కేంద్రానికి మరమ్మత్తు పనులు ప్రారంభం

**రామారెడ్డి రాజ ముద్ర న్యూస్**

రామారెడ్డి మండలం అన్నారం గ్రామం లోని అంగన్వాడీ కేంద్రానికి మారమ్మతుల పనుల కోసం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించిన సర్పంచ్ లత శ్రీనివాస్ ,ఉపసర్పంచ్ దయానంద్.వార్డ్ సభ్యులు. ఈ సందర్భంగ ఉప సర్పంచ్ దయానంద్ మాట్లాడుతు గత 10ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలు ఎలాంటి అభివృద్ధి కి నోచుకోలేదు కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక విద్య కు పెద్ద పీట వేస్తూ రాష్ట్రము లో అన్ని ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంట్ అందిస్తూ మధ్యాహ్నం భోజనం కు మెస్ చార్జీలు కూడా పెంచడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాలల్లో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్న ప్రజా ప్రభుత్వనికి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ లత శ్రీనివాస్ ఉపసర్పంచ్ దయానంద్. మాజీ సొసైటీ చైర్మన్ స్వామి గౌడ్. వార్డ్ సభ్యులు. దేవదాస్.కిసరి లక్ష్మణ్. ఎల్లం, కూడలి స్వామి. పంగ రాజం. తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సభ్యుల సంఘటితంతోనే అభివృద్ధి సాధ్యం



**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:**

కాలనీ సభ్యులందరూ సంఘటితంగా ఉంటేనే రామకృష్ణ నగర్ అభివృద్ధి సాధ్యమని నూతనంగా ఎన్నికైన కాలనీ అధ్యక్షుడు గడ్డం భిక్షం రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామకృష్ణ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో ననబోలు రాజశేఖర్ రెడ్డి బలపరిచిన అభ్యర్థి గడ్డం భిక్షం రెడ్డి తన ప్రత్యర్థి పోతురాజుపై 40 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. కాలనీలో మొత్తం 222 ఓట్లు ఉండగా, 162 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో భిక్షం రెడ్డికి 100 ఓట్లు రాగా, పోతురాజుకు 60 ఓట్లు వచ్చాయి. రెండు ఓట్లు చెల్లకుండా పోయాయి. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కాల్వ విజయ్ కుమార్, వెన్నోజు సత్యం, రావుల సురేష్ రెడ్డిల పర్యవేక్షణలో బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నికల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా ముగిసింది. విజయం అనంతరం భిక్షం రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో గెలిపించిన కాలనీ వాసులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరి సహకారంతో కాలనీలోని సమస్యలను పరిష్కరించి, రామకృష్ణ నగర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ననబోలు రాజశేఖర్ రెడ్డి, కాల్వ విజయ్ కుమార్, వెన్నోజు సత్యం, రావుల సురేష్ రెడ్డి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# రెడ్డి చెరువు హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్



**ఆర్మూర్ మార్చ్ 22 :**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో గల అతి పురాతనమై రెడ్డి చెరువు హనుమాన్ ఆలయం ఆవరణలో ఆదివారం రోజు స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయం ఆవరణలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కొడిగెల మల్లయ్య, మాట్లాడుతూ స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయానికి వచ్చే ప్రతి ఒక్క భక్తుడు ఆలయాన్ని కాపాడుకోవాలన్నారు. ఎంతో పురాతనమైన ఈ ఆలయం ఆవరణలో భక్తులు పలు శుభకార్యాలు నిర్వహించి తిని పడేసిన విస్తార్లు, గ్లాసులతో ఆలయ ప్రాంగణంతా నిండిపోయిందన్నారు. దీనికి ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా ఆలయం బయట చెత్తను వేయాలని కోరారు. ప్రతి పౌర్ణమికి ఈ ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ, 47 వారాలుగా ఈ స్వచ్ఛ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా ఈ రోజు ఎంతో పురాతనమైన రెడ్డి చెరువు హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆలయం ఆవరణలో గల వాటర్ ట్యాంకు, ఆలయ పరిసరాలను శుభ్రం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బొగడమీది సాగర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు బొగడమీది ప్రశాంత్, వేదశ్రీ రాజ్ కుమార్, జంగిడి బోజన్న, బాశెట్టి పెద్ద గగారాం, సాయి కిరణ్, బట్టు సుమన్, డ్రైవింగ్ స్కూల్ వేణు, రాహుల్ రాజ్, యాదగిరి, కుంకింగ్ నరేష్, గణేష్, కృషి వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# ట్రిపుల్‌ఆర్ డిజైన్‌లో భారీ మార్పులు

- **సాధారణ హైవేగా మారుతున్న రీజినల్ రింగ్ రోడ్డు**



**హైదరాబాద్, మార్చి 22:**

హైదరాబాద్ చుట్టూ నిర్మించాల్సిన రీజినల్ రింగ్ రోడ్డు (RRR) ప్రాజెక్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక మార్పులు చేపట్టాయి. తొలుత ప్రతిపాదించిన ట్రిపుల్ ఆర్ డిజైన్‌లో పలు ప్రత్యేకతలను తొలగించి, భారీ వ్యయాన్ని తగ్గించే లక్ష్యంతో సాధారణ హైవే నమూనాకు మార్చినట్లు తెలుస్తోంది. మొదట ఈ ప్రాజెక్టును దేశంలోనే అతి పొడవైన 8 లైన్ల రింగ్ రోడ్డుగా రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే భవిష్యత్తు ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 8 లైన్లు అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడడంతో దానిని 6 లైన్లకు కుదించారు. రింగ్ రోడ్డు మొత్తం పొడవునా ఎల్ఈడీ స్ట్రీట్ లైటింగ్ ఏర్పాటు చేయాలని మొదట ప్రణాళిక ఉండగా, అధిక వ్యయం కారణంగా ఇప్పుడు గ్రామాలు తగిలే ప్రాంతాల్లో మాత్రమే లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మొదట ORR తరహాలో ట్రిపుల్ ఆర్‌కు కూడా సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే తాజా మార్పుల ప్రకారం సర్వీస్ రోడ్లకు బదులుగా కేవలం ఖాళీ స్థలాన్ని మాత్రమే ఉంచేలా ఆమోదం లభించినట్లు సమాచారం. ఇదే విధంగా గరిష్ట వేగ పరిమితిని కూడా తగ్గించారు. ప్రారంభ డిజైన్ ప్రకారం గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగం అనుమతించాలని భావించగా, ఇప్పుడు దానిని గంటకు 100 కిలోమీటర్లకు పరిమితం చేశారు. ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగంలో మొత్తం 204 వంతెనలు నిర్మించాలని తొలుత ప్రతిపాదించారు. మూసీ, మంజీరా, హరిద్ర నదులతో పాటు పలు వాగులు, వంకలపై వంతెనలు నిర్మించాలని ప్రణాళిక ఉన్నప్పటికీ, వ్యయం పెరగడంతో వాటి సంఖ్యను సగానికి తగ్గించారు. అదేవిధంగా రోడ్డు నిలువు వాలు (వర్టికల్ కర్వ్) పొడవును కూడా తగ్గించారు. తొలుత 1300 మీటర్లుగా రూపొందించిన డిజైన్‌ను 650 మీటర్లకు కుదించారు. దీంతో ముందస్తు విజిబిలిటీ తగ్గే అవకాశం ఉందని, వేగంగా ప్రయాణించే వాహనాలకు ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఇందల్వాయిలో అకస్మాత్తుగా తగలబడ్డ బైక్



- **తృటిలో తప్పిన ప్రాణాపాయం**

**ఇందల్వాయి,మార్చ్ 22 :**

ఇందల్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఆదివారం ఒక మోటార్ సైకిల్ అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుని పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తూ బైక్ నడుపుతున్న యువకుడు తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నాడు.ఈ సందర్భంగా సిరికొండ మండలం న్యావనంది గ్రామానికి చెందిన గోవింద్ అనే యువకుడు తన బజాజ్ డిస్కవరీ బైక్ (నంబర్: MH 31 CC 1971) పై వెళ్తుండగా, ఇందల్వాయి ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు రాగానే సైలెన్సర్ నుండి వింత శబ్దాలు రావడం గమనించాడు. ప్రమాదాన్ని శంకించిన యువకుడు వెంటనే బైకును పక్కకు ఆపి దూరంగా పరిగెత్తాడు. అతను దిగిన క్షణాల్లోనే బైక్ నుండి పెద్ద ఎత్తున మంటలు చెలరేగి వాహనం మొత్తం వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు మరియు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేసినప్పటికీ, అప్పటికే బైక్ పూర్తిగా కాలి బూడిదైపోయింది.

ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. వాహనంలో తలెత్తిన సాంకేతిక లోపం లేదా షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు.

# అవ్వకు బువ్వ




**ఆర్మూర్ మార్చ్ 22:**

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని జిరాయత్ నగర్ లో గల విద్యా హై స్కూల్ ఆవరణలో ఆదివారం రోజు రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యములో అవ్వకు బువ్వ కార్యక్రమము నిర్వహించారు. ప్రతి నెలలో భాగంగా అతి నిరుపేద వృద్ధులకు ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున దాదాపు 58 మంది పేద వృద్ధులకు ఉచితంగా బియ్యం పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాస్ ఖాందేష్ మాట్లాడుతూ, అవ్వకు బువ్వ కార్యక్రమం ద్వారా అతినిరుపేద వృద్ధుల ఆకలి తీర్చడానికి తమవంతు కృషి చేస్తున్నాం అన్నారు. రక్షా స్వచ్ఛంధ సేవా సంస్థ తరపున రాబోయే రోజుల్లో మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. వేసవి కాలమును దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహార్తిని తీర్చడానికి ప్రతి సంవత్సరం లాగే త్వరలో చలి వేంద్రం ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందం నరహరి, ఎస్ జి శ్రీకాంత్, కోశాధికారి గొనె శ్రీధర్, కార్యనిర్వహక కార్యదర్శులు తులసి పట్వారి, ఖాందేష్ సత్యం, సభ్యులు ఖాందేష్ గంగాధర్, ప్రవీణ్, మక్కల సాయి కుమార్, బండారి నరేశ్, ఖొడే శ్రీనివాస్, మహేష్, కళ్యాణ్, శ్రీను రాజేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



# దుబ్బాక సమస్యలు పరిష్కరించండి

**సిద్దిపేట, మార్చి22 :**

సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో ముఖ్యమంత్రి పర్యటనలో 8 ముఖ్యాంశాలతో సీఎం రేవంత్ రెడ్డి కి మెదక్ ఎంపీ రఘునందన్ రావు వినతి పత్రం ఇచ్చారు. గజ్వేల్ లో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ లో దుబ్బాక శాసనసభ నియోజకవర్గ పరిధిలో అన్ని గ్రామాలకు కాలువల ద్వారా నీళ్లు అందించాలన్నారు. తపాస్ పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని ఎనిమిది గ్రామాలకు నీళ్లు అందించాలన్నారు. 765 డిజి జాతీయ రహదారి హబ్సిపూర్ నుంచి దుబ్బాక అంబేద్కర్ విగ్రహం వరకు నాలుగు లైన్ల రోడ్డు వేయాలని కోరారు. ఎనగుర్తి చౌరస్తా నుంచి బొప్పాపూర్ మీదుగా శిలాజీ నగర్ కు డబుల్ రోడ్డు మంజూరు చేయాలన్నారు. కొండపాక మండల కేంద్రంలో కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. మెదక్ జిల్లా, సంగారెడ్డి జిల్లాలో ఆయిల్ ఫామ్ కంపెనీల ఏర్పాటు వెంటనే చేయాలని వినతి చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## గోదావరిని ఎండపెడుతున్న

# రేవంత్ రెడ్డికి పిండప్రదానం

- **రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వినూత్న నిరసన**



**గోదావరిఖని, మార్చి 22:**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పరిసరాల్లో ఎండిపోయిన గోదావరి నది తీరంలో బీఆర్ఎస్ నాయకులు వినూత్న నిరసన కార్యక్రమం చేపట్టారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డికి సంప్రదాయ పద్ధతిలో పిండప్రదానం చేసి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిలో నీటిని విడుదల చేయకపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మత్తులు చేపట్టకపోవడం వల్ల రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు ఆరోపించారు. వెంటనే ప్రాజెక్టు మరమ్మత్తులు పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. నిరసనలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొని గ్రామీణ ఆటపాటల ద్వారా ప్రభుత్వ వైఖరిని వ్యంగ్యంగా నిరసించారు.



# ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం

- **ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు**

**శంషాబాద్ రూరల్, మార్చి 22 :**

ఔటర్‌రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలైన ఘటన ఆదివారం జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ నుంచి హైదరాబాద్(గాచ్చిబౌలి)కి ఏపీ 36 ఏఆర్ 5511 నంబర్‌గల కారులో బయలుదేరి వస్తుండగా శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి వద్దకు రాగానే కారు డ్రైవర్ రాజేష్ ముందుగా వెళ్తున్న టీఎస్08యూఎఫ్ 8229 నంబర్‌గల లారీని ఓవర్‌టెక్ చేయబోయి ఢీకొట్టడంతో కారు దెబ్బతినడంతో పాటు కారులో ఉన్న వారందరికి గాయాలైయ్యాయి.

# ఆధునిక పరిజ్ఞానంతో కచ్చితమైన రోగ నిర్ధారణ

**ఖైరతాబాద్, మార్చి 22 :** వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందడం ద్వారా అనేక రోగాలకు కచ్చితమైన నిర్ధారణ సాధ్యమవుతుందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అన్నారు. ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు నిమ్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. ఈ సదస్సును ప్రారంభించిన డైరెక్టర్ బీరప్ప మాట్లాడుతూ హైదరాబాద్‌లో ముమ్మందు నాలుగు తెలంగాణ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) అందుబాటులోకి రానున్నాయని, తద్వారా 4వేల పడకలు వస్తాయని, నిమ్స్‌లో అదనంగా 2వేలు, ఉస్మానియా, కాకతీయ వైద్యశాలల్లో మరో 3వేల పడకలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం సదస్సులో ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జీవన సాఫల్య పురస్కారాన్ని నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపల్ శీరందాస్ శ్రీనివాస్‌కు అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. రామ్మూర్తి, కాకర్ల సుబ్బారావు రేడియాలజీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ ఎన్. కవితా రెడ్డి, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ చైర్మన్ కె. మునిరత్నం, అకాడమిక్ చైర్మన్ కె. దామోదర నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎంఎ వారిస్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మహేశ్ బసనేని తదితరులు పాల్గొన్నారు.



# స్నేహితుల మధ్య గొడవలో యువకుడి హత్య

బంజారాహిల్స్, మార్చి 22: గంజాయి తాగొద్దంటూ మందలించిన వ్యవహారంలో స్నేహితుల మధ్య చోటు చేసుకున్న గొడవలో ఛాతీపై కొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని గౌరీశంకర్ కాలనీలో నివాసం ఉంటున్న రఘువీర్ రాయ్ (19) అనే యువకుడు పదో తరగతి చదువుతూ మధ్యలో ఆపేశాడు. స్థానికంగా నివాసం ఉంటున్న పింటూ(17) సాయి సూ ర్య, అక్షయ్‌కుమార్ స్నేహితులు. గత కొంతకాలంగా సాయిసూర్య(19), అక్షయ్‌కుమార్(19)లతో కలిసి రఘువీర్ రాయ్ గంజా యి తాగుతూ ఆవారాగా తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి రోడ్ నెం 7లోని పార్కులో రఘువీర్ రాయ్‌తో పా టు అతడి స్నేహితులు కలిసి గంజాయి సేవిస్తున్నారని గుర్తించిన పింటూ అక్కడకు వచ్చా డు. రఘువీర్‌ను తీవ్రంగా మం దలించడంతో గొడవ ప్రారంభమైంది. ఈ గొడవలో భాగంగా పింటూ కోపంతో రఘువీర్‌పై తలతో పాటు ఛాతీపై కొట్టడంతో ఒక్కసారిగా ఫిట్స్ వచ్చి కుప్పకూలడంతో పాటు అక్కడిక్కడే మృతి చెందాడు.

